ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
సోమవారం 14 అక్టోబరు 2024 | 5





ఉద్యమమే.. ఊపిరిగా

హక్కుల పోరాట నేత సాయిబాబా కన్నుమూత

- సన్నవిల్లి, అమలాపురంలో ప్రాథమిక, ఉన్నత విద్యాభ్యాసం
- అనంతరం హైదరాబాద్‌కు పయనం
- అమలాపురానికి చెందిన అరిగెల వసంతతో ప్రేమ వివాహం
- జిల్లాలో పౌరహక్కుల సంఘాలు, వామపక్ష నేతల నివాళి



సాయిబాబా చదివిన హైస్కూల్

అమలాపురం, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడే వ్యక్తి, ఉద్యమాలతో ప్రభుత్వాలపై గళం విప్పే చైతన్య మూర్తి విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ గోకరకొండ సాయిబాబా. ఆయన శనివారం రాత్రి హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో మృతిచెందారన్న వార్త కోనసీమ వాసులను దిగ్భ్రాంతికి గురిచేసింది. అమలాపురంలో పుట్టిన సాయిబాబా గురించి తెలిసినవారెవరైనా ఆయన ఉద్యమ మార్గాన్ని కొనియాడుతున్నారు. ప్రజా హక్కుల కోసం నిరంతరం పోరాడే మహోన్నత వ్యక్తిగా ఆయనను కీర్తిస్తున్నారు. ఉన్నత విద్యాభ్యాసం వరకు అమలాపురంలోనే చేసిన ఆయన ఆ తర్వాత హైదరాబాద్ వెళ్లి సెంట్రల్ యూనివర్సిటీలో పీజీ పూర్తిచేసి పౌర హక్కుల పోరాటాల్లో కీలకంగా మారారు. అటువంటి సాయిబాబా ఇక లేరన్న వార్తను కోనసీమ ప్రజలు జీర్ణించుకోలేపోతున్నారు. ఆయన పుట్టి పెరిగిన ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇప్పటికీ ఆయన నివాసం ఉండే వీధి, వారి అత్తవారిల్లు శిథిలస్థితికి చేరినప్పటికీ వాటిని చూసేందుకు కూడా ప్రజలు తరలివస్తున్నారు. సాయిబాబా మృతి పట్ల ప్రజా సంఘాలు కూడా దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ సంతాపాలు తెలిపారు.

ఇదీ సాయిబాబా చరిత్ర..

ప్రముఖ రచయిత, విద్యావేత్త, మానవహక్కుల ఉద్యమనేత, ఢిల్లీ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ గోకరకొండ సాయిబాబా(57) శనివారం రాత్రి హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. గత కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మృతిచెందారు. అమలాపురం పట్టణంలో గాంధీనగర్‌లో ఓ పేదరైతు కుటుంబంలో 1967లో సాయిబాబా జన్మించారు. ఉప్పలగుప్తం మండలం సన్నవిల్లి గ్రామంలో ప్రాథమిక విద్య పూర్తి చేసుకుని ఆయన అమలాపురంలోని సెయింట్‌జాన్ హైస్కూల్‌లో టెన్త్ వరకు, ఎస్‌కేబీఆర్ కళాశాలలో ఇంటర్, డిగ్రీ పూర్తిచేశారు. ఐదేళ్ల వయసులోనే ఆయన వీల్‌ఛైర్‌కు పరిమితమయ్యారు. అమలాపురంలో విద్యాభ్యాసం చేస్తున్న సమయంలోనే ఆయన వామపక్ష రాజకీయాల వైపు ఆకర్షితులయ్యారు. తర్వాత ఆల్ ఇండియా పీపుల్స్ రెసిస్టెన్స్ ఫోరం(ఏఐఆర్‌పీఎఫ్)లో చేరారు. గాంధీనగర్‌లో నివాసం ఉండే సాయిబాబా అమలాపురం పట్టణంలోని ఝైపాల వీధికి చెందిన అరిగెల వసంతను ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి కుమార్తె మంజీల ఉన్నారు. కాలేజీ చదువుల సమయంలోనే కుటుంబమంతా హైదరాబాద్ వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. వారి సోదరుడు, ఇతర కుటుంబ సభ్యులు సైతం హైదరాబాద్‌లోనే స్థిరపడడంతో గోకరకొండ సాయిబాబాకు సంబంధించిన సమాచారం ఇక్కడ పెద్దగా తెలియరాలేదు. వారికి సంబంధించిన దూరపు బంధువులు గోకరకొండ వంశీ అమలాపురం రూరల్ మండలం నల్లమిల్లి గ్రామంలో ఉన్నారు. సాయిబాబా మరణవార్త తెలుసుకున్న తర్వాత వారితో పాటు కొందరు ముఖ్యులు హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు. అయితే సాయిబాబా వ్యక్తిత్వం, వారి కుటుంబం నేపథ్యం గురించి అమలాపురం పట్టణంలో ప్రజలంతా మంచిగానే చెబుతున్నారు. ఆయన మృతిపట్ల అమలాపురం పట్టణంలో పలు ప్రజా సంఘాలు, పౌర హక్కుల సంఘాలు, వామపక్ష నేతలు ఘన నివాళులర్పించారు.



అన్నవరం రత్నగిరిపై రావణదహనం కార్యక్రమంలో బాణాసంచా కాల్పులు



పిఠాపురం పాదగయలో విజయదుర్గా అలంకారంలో దర్శనమిస్తున్న రాజరాజేశ్వరీదేవి



తుని మండలం లోవలో విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న తలుపులమ్మ అమ్మవారు



సామర్లకోట భీమేశ్వరాలయంలో వెండి చీర అలంకారంలో దర్శనమిస్తున్న బాలాత్రిపురసుందరి

ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు

- విజయదుర్గా అలంకారంలో అమ్మవారు

శరన్నవరాత్రి ఉత్సవాలు విజయదశమితో ముగిశాయి. జిల్లాలో ప్రముఖ ఆలయాలైన పిఠాపురం పాదయగ క్షేత్రం, తుని తలుపులమ్మ లోవ, అన్నవరంలోని రత్నగిరి, సామర్లకోట లోని భీమేశ్వరస్వామి, కాకినాడ బాలాత్రిపురసుందరి ఆలయాల్లో తొమ్మిదిరోజులపాటు వివిధ కార్యక్రమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాల్లో అమ్మవారిని ప్రతిరోజూ ప్రత్యేకంగా అలంకరించారు. శనివారం దసరా ముగింపు సందర్భంగా అమ్మవారు విజయదుర్గా అమ్మవారి అలంకారంలో ప్రత్యేక పూజలు అందుకున్నారు. - 8లో

జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయుధ పూజ



ఆయుధ పూజ నిర్వహిస్తున్న ఎస్పీ పాటిల్

కాకినాడ క్రైం, అక్టోబరు 13: దసరా పండుగను పురస్కరించుకుని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆధ్వర్యంలో శనివారం ఆయుధపూజ నిర్వహించారు. కాకినాడలోని ఆర్మ్‌డ్ రిజర్వ్ ప్రధాన కార్యాలయంలో భద్రపర్చిన ఆయుధాలు, వాహనాలకు ఎస్పీ విక్రాంత్‌పాటిల్ పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. దుర్గామాత ఆశీస్సులతో జిల్లా ప్రజలు సంతోషంగా ప్రశాంతంగా జీవించాలన్ని ఆకాంక్షించారు. పోలీసుల విధులు, సేవల్లో విజయాలు చేకూరాలన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం రద్దు

కలెక్టరేట్(కాకినాడ),అక్టోబరు13: ప్రజాసమస్యలు పరిష్కారానికి ఏర్పాటు చేసిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ సోమవారం అనివార్య కారణాలవల్ల రద్దు చేశామని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు.

ఎవరికి దక్కేనో?



- నేడు జిల్లాలో 155 మద్యం దుకాణాలు కేటాయింపు
- కాకినాడ కలెక్టరేట్‌లో కలెక్టర్ సమక్షంలో లాటరీ ద్వారా కేటాయింపు
- అదృష్టం పరీక్షించుకోనున్న దుకాణదారులు

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 13: జిల్లాలో మద్యం దుకాణాల కేటాయింపునకు యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. సోమవారం ఉదయం 8గంటలకు కాకినాడ కలెక్టరేట్‌లో వివేకానంద హాలులో కలెక్టర్ షాన్‌మోహన్ సమక్షంలో లాటరీ విధానంలో దుకాణాలను కేటాయించనున్నారు. ఇందులో ఎవరికి అదృష్టం దక్కుతుందో అనే సందిగ్ధత జిల్లావ్యాప్తంగా ఆశావహుల్లో కొనసాగుతోంది.

కాకినాడ జిల్లాలో మద్యం దుకాణాల కేటాయింపు కోసం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించగా 155 మద్యం దుకాణాలకు 3135 దరఖాస్తులు వచ్చాయి. కాకినాడ నగరంలో 36 దుకాణాలకు 660 దరఖాస్తులు రికార్డుస్థాయిలో వచ్చాయి. మొత్తం 7ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో దరఖాస్తులను స్వీకరించారు. కాకినాడ సౌత్,నార్త్ ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 63 మద్యం దుకాణాలకు 1288 దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలో అత్యధిక మద్యం దుకాణాలు ఈ రెండుస్టేషన్ల పరిధిలోనే ఉన్నాయి. పైగా ఈ ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో కాకినాడ నగరం, కాకినాడ రూరల్, పెదపూడి, సామర్లకోట మున్సిపాల్టీ, సామర్లకోట మండలాలున్నాయి. దీంతో ఈ మండలాల్లో దుకాణాలకు భలే డిమాండ్‌ఉంది. ఏటా కోట్లాది రూపాయల విక్రయాలు ఇక్కడ నెలకొన్నాయి. పిఠాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 19 మద్యం దుకాణాలకు 332 దరఖాస్తులు వచ్చాయి. తాళ్లరేవు పరిధిలో 17 దుకాణాలకు 426మంది, పెద్దాపురం పరిధిలో 19 దుకాణాలకు 395మంది, ప్రత్తిపాడు పరిధిలో 15 దుకాణాలకు 345మంది, తుని పరిధిలో 22 దుకాణాలకు 349 మంది దరఖాస్తు చేశారు.

తమకే దక్కాలని ప్రత్యేక పూజలు

మద్యం దుకాణాల కేటాయింపుపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. దుకాణాల ఎట్టి పరిస్థితిలో తమకే దక్కాలని దరఖాస్తుదారులు ప్రయత్నిస్తున్నారు. వచ్చిన సువర్ణ అవకాశాన్ని ఎట్టిపరిస్థితుల్లో వదులుకోకూడదనే భావనలో ఔత్సాహికులైన వ్యాపారులు ఉన్నారు. మద్యం దుకాణాలు లాటరీలో తమకే దక్కాలని దరఖాస్తుదారులు నవరాత్రుల్లో దుర్గమ్మకి పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు.

ఉదయం 7గంటలకే..

కాకినాడ కలెక్టరేట్ వివేకానంద సమావేశ మందిరంలో జరిగే మద్యం దుకాణాల కేటాయింపు కార్యక్రమానికి దరఖాస్తుదారులు సోమవారం ఉదయం 7గంటలకే చేరుకోవా లని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికా రిని కృష్ణకుమారి తెలిపారు. ఓటరు గుర్తిం పుకార్డుగానీ, డ్రైవింగ్ లైసెన్సుగానీ, పాస్‌పో ర్టు, బ్యాంకు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, ఇతర గుర్తింపుకార్డులతో మాత్రమే ప్రవేశం లభిస్తుందన్నారు. 8గంటలకు లాటరీలో దుకాణాల కేటాయింపు చేస్తారన్నారు.

ఎక్సైజ్ ట్యాక్స్ కట్టడానికి బ్యాంకు కౌంటర్లు ఏర్పాటు

లాటరీలో నెగ్గిన అభ్యర్థులు ప్రభుత్వం నిర్దేశించిన ఒకటి బై ఆరో వంతు రీటైల్ ఎక్సైజ్ ట్యాక్స్‌ను కట్టడానికి బ్యాంకు కౌంటర్లను లాటరీ జరిగే ప్రాంగణంలో ఏర్పాటు చేశామని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కృష్ణకుమారి తెలిపారు. నూతన మద్యం పాలసీ అమలుకు సంబంధించి ప్రతి ప్రక్రియను పారదర్శకంగా అపోహలకు తావులేకుండా జవాబుదారీతనంతో నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియ వీడియోగ్రఫీ, ఫొటోగ్రఫీ తీయిస్తామన్నారు. దరఖాస్తుదారుడికి బదులుగా వేరొకరు లాటరీలో పాల్గొనాలంటే దరఖాస్తుదారు డి సంతకం చేసిన అప్లికేషన్‌తోపాటు సెల్ఫ్‌అటెస్టేడ్ గుర్తింపుకార్డు తీసుకెళ్లారన్నారు.

పిఠాపురం పాదగయలో కన్నులపండువగా..

తెప్పోత్సవం

- హంస వాహనంపై రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామిల విహారం
- భారీగా తరలివచ్చిన భక్తులు



పిఠాపురం పాదగయ పుష్కరిణిలో హంసవాహనంపై జరుగుతున్న తెప్పోత్సవం

పిఠాపురం, అక్టోబరు 13: పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రంలో అమ్మవార్ల తెప్పోత్సవం కనులపండువగా జరిగింది. హంసవాహనంపై రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వస్వామిల విహారాన్ని వీక్షించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. మిరుగొట్లు గొలిపే బాణసంచా పేలుళ్ల, భారీగా తరలివచ్చిన జనసందోహం మధ్య స్వామి, అమ్మవార్లు పుష్కరిణిలో హంసవాహనంపై విహరించారు. విజయదశమి పర్వదినాన నిర్వహించిన ఈ ఉత్సవం భక్తులను ఆనందతన్మయత్వాల్లో ముంచెత్తింది. ముందుగా కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరీదేవి విగ్రహాలను పల్లకిపై ఉంచి ఆలయంలో ప్రదిక్షణలు చేశారు. అనంతరం జమ్మిచెట్టు వద్ద ఎస్పీ విక్రాంత్‌పాటిల్, ఆలయ ఈవో, సహాయ కమిషనరు పి.విశ్వనాథరాజు శమిపూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవమూర్తులను హంసవాహనంపై ఉంచి పుష్కరిణిలో తిరుగాడారు. పాదగయ పరిసరాలన్నీ అమ్మవారి నామస్మరణతో మార్మోగింది. కార్యక్రమాల్లో ఆలయ ఈవో విశ్వనాథరాజు, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

శ్రీపీఠంలో ముగిసిన మహాశక్తి యాగం

- 7లో

అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్టు

- రూ.5లక్షల బంగారు ఆభరణాలు, కారు స్వాధీనం
- 24 గంటల్లోనే చేధించిన పోలీసులు

- 7లో

నేడు పిఠాపురం పురపాలక సంఘంలో విచారణ

- అమరావతి నుంచి రానున్న ఉన్నతాధికారుల బృందం

పిఠాపురం, అక్టోబరు 13: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించిన పిఠాపురం పురపాలక సంఘంలో కమిషనర్, డీఈఈ మధ్య జరిగిన తోపులాట, వాగ్వివాదం వ్యవహారంపై విచారణకు ప్రభుత్వం నియమించిన ముగ్గురు ఉన్నతాధికారులు సోమవారం పిఠాపురం రానున్నారు. వీరు పిఠాపురం పురపాలక సంఘంలో విచారణ నిర్వహించనున్నారు.

ఆగస్టు 31న పిఠాపురం మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో కమిషనర్ కనకారావు, డీఈఈ భవానీప్రసాద్ కౌన్సిల్ సభ్యుల సాక్షిగా వాగ్వివాదానికి దిగి ఒకరిని ఒకరు తోసుకోవడంతో పాటు కొట్టుకున్నారు. అందరూ తలదించుకునేలా బూతులు తిట్టుకున్నారు. ఈ వ్యవహారంపై అప్పట్లో మునిసిపల్ ఆర్డీ నాగనరసింహారావు, కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్ విచారణ జరిపి నివేదిక ఇచ్చారు. దీనిపై కలెక్టరు పంపిన నివేదిక ఆధారంగా మునిసిపల్ డీఈఈ భవానీశంకర్‌ను సస్పెండ్ చేశారు. డీఈఈ హైకోర్టును ఆశ్రయించడంతో సదరు సస్పెన్షన్ ఉత్తర్వులను రద్దు చేసింది. ఆయన అక్టోబరు 1న తిరిగి విధుల్లో చేరారు. మునిసిపల్ కమిషనరు, డీఈఈ మధ్య జరిగిన ఫైట్ వ్యవహారాన్ని రాష్ట్రప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. దీనికి సంబంధించి పూర్తిస్థాయి విచారణ కోసం మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అడిషనల్ డైరెక్టరు పి.పూర్ణచంద్రరావు, పబ్లిక్ హెల్త్ డిప్యూటీ ఇంజనీర్ ఇన్ చీఫ్ ఎం.బ్రహ్మాజీ, టౌన్ ప్లానింగ్ అడిషనల్ డైరెక్టరు బి.శ్రీనివాసులతో కూడిన కమిటీని ఏర్పాటు చేస్తూ సెప్టెంబరు 25న పురపరిపాలనాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ ఉత్తర్వులు జారీ చేశారు. వీరు సోమవారం పిఠాపురం పురపాలక సంఘానికి వచ్చి కౌన్సిల్ సమావేశంలో జరిగిన సంఘటనపై విచారణ చేయనున్నారు. దీనిపై పురపరిపాలనశాఖ ప్రాంతీయ డైరెక్టరు నాగనరసింహారావుతోపాటు ఆగస్టు 31న కౌన్సిల్ సమావేశానికి అధ్యక్షత వహించిన మునిసిపల్ వైస్‌చైర్‌పర్సన్ పచ్చిమళ్ల జ్యోతి, హాజరైన కౌన్సిలర్లకు విచారణకు హాజరుకావాలని కోరుతూ విచారణ బృందానికి నేతృత్వం వహిస్తున్న మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అడిషనల్ డైరెక్టరు పూర్ణచంద్రరావు నోటీసులు జారీ చేశారు. ఆ రోజున జరిగిన సంఘటనపై వీరినుంచి వివరాలు సేకరించనున్నారు.





డబ్బింగ్ జానకికి సూర్యకాంతం జీవితకాల సాఫల్య పురస్కారం ప్రదానం చేస్తున్న దృశ్యం

డబ్బింగ్ జానకికి సూర్యకాంతం జీవితకాల సాఫల్య పురస్కారం ప్రదానం

పోర్టుసిటీ(కాకినాడ), అక్టోబరు 13: ప్రముఖ రంగస్థల టీవీ, చలనచిత్ర నటి డబ్బింగ్ జానకికి సూర్యకాంతం జీవితకాల సాఫల్య పురస్కారం ప్రదానం చేశారు. ఆదివారం రాత్రి దంటు కళాక్షేత్రంలో ది యంగ్మెన్స్ హ్యాపీక్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమెకు మెమొంటో, నగదు బహుమతి అందజేశారు. అనంతరం సంగీత నవావధానం జరిగింది. క్లబ్ అధ్యక్షుడు దంటు భాస్కరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా శాసనసభ పూర్వ ఉపసభాపతి, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆమెను ఘనంగా సత్కరించారు. అచ్చ తెలుగుభాషలో మాట్లాడి తెలుగు వైభవాన్ని సూర్యకాంతం ప్రపంచం నలుమూలలా చాటారని కొనియాడారు. కార్యక్రమంలో కాకినాడ సీపోర్ట్సు సీఈవో మెర్ల మురళీధర్, ఎన్‌టీఆర్ కళాపరిషత్ ఒంగోలు కార్యదర్శి కందిమళ్ల సాంబశివరావు, డాక్టర్ వాడ్రేవు రవి, సూర్యకాంతం కుమారుడు అనంత పద్మనాభమూర్తి, ది యంగ్మెన్స్ హ్యాపీ క్లబ్ క్లబ్ ప్రధాన కార్యదర్శి పీవీ రావు, నాదెళ్ల ప్రభుదాస్, సాహితీ స్రవంతి నగర అధ్యక్షుడు మార్ని జానకిరామ్ చౌదరి, శాస్త్రీయ సంగీత విద్వాంసురాలు పెద్దాడ సూర్యకుమారి పాల్గొన్నారు.

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు

- 51 బస్తాల్లో 2600 కిలోల రేషన్ బియ్యం స్వాధీనం
- వాహనం సీజ్

కాకినాడ క్రైం, అక్టోబరు 13: రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతున్నట్లు వచ్చిన పక్కా సమాచారంతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించి 2600 కిలోల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని అక్రమ రవాణాకు ఉపయోగించిన వాహనాన్ని సీజ్ చేసి నిందితుడిని అరెస్ట్ చేసిన సంఘటన శనివారం కాకినాడలో జరిగింది. రీజనల్ విజిలెన్స్ ఎస్పీ ఎం.స్నేహితకు వచ్చిన సమాచారంతో కాకినాడ కల్పనా థియేటర్ కూడలి వద్ద స్నేహిత ఆధ్వర్యంలో దాడులు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులకు అశోక్ లేలాండ్ బడా దోస్త్ వాహనాన్ని తనిఖీ చేయగా 51 బస్తాల్లో 2600 కిలోల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించారు. అనంతరం బియ్యాన్ని సీజ్ చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు. బియ్యం విలువ రూ.9,55,650 ఉంటుందని ఎస్పీ స్నేహిత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజమహేంద్రవరం రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పరిధిలోని మూడు జిల్లాల్లో రేషన్‌బియ్యం అక్రమ నిల్వలు లేదా అక్రమ రవాణా పై నిరంతర నిఘా కొనసాగుతుందన్నారు. దాడుల్లో విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.



రేషన్ బియ్యం వాహనం, నిందితుడితో విజిలెన్స్ బృందం

అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం స్వాధీనం

కాకినాడ క్రైం, అక్టోబరు 13: అక్రమంగా నిల్వ ఉంచి గుట్టుచప్పుడుగా విక్రయిస్తున్న మద్యాన్ని కాకినాడ వన్‌టౌన్ పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ నాగదుర్గరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జగన్నాథపురం రిక్షాలపేటలో మద్యం అక్రమంగా నిల్వ ఉంచి విక్రయాలు జరుపుతున్నారన్న సమాచారంతో సీఐ నాగదుర్గారావు బృందం పెసంగి గంగాధర్ అనే వ్యక్తి ఇంటిపై దాడి చేసి 70 క్వార్టర్(180ఎంఎల్) బాటిళ్లను స్వాధీనం చేసుకుంది. నిందితుడు గంగాధర్‌ను ఎక్సైజ్ యాక్ట్ కింద అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

దసరా ఉత్సవాల్లో అపశృతి

డీజే పాటలకు డ్యాన్స్ చేస్తుండగా కుప్పకూలి యువకుడి మృతి



సాయివినయ్ (పాత చిత్రం)

అమలాపురం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉత్సవంలో ఉత్సాహం ఉరకలు వేసింది. డీజే ముందు డ్యాన్సులు చేస్తూ సహచర మిత్రులతో సంభ్రమాశ్చర్యాల్లో మునిగి తేలిన ఆ యువకుడు అకస్మాత్తుగా కుప్పకూలిపోయాడు. కొన్ని నిమిషాల తర్వాత తనువు చాలించిన ఈ ఘటన కొంకాపల్లిలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. యువకుడి మృతి ఆ సంబరంలో పాల్గొన్న వేల మందిని కలచివేసింది. వివరాలు ఇలా ఉన్నాయి.... విజయదసమి పర్వదినం సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం పట్టణంలోని కొంకాపల్లిలో శనివారం రాత్రి చెడీతాలింఖానా ఉత్సవంలో అపశృతి చోటుచేసుకుంది. అమలాపురం రూరల్ మండలం బండారులంక గ్రామానికి చెందిన పప్పుల సాయివినయ్ (22) డీజే వద్ద డాన్సులు చేస్తుండగా సడన్‌గా కుప్పకూలిపోయాడు. అతడిని హుటాహుటిన స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా ప్రాణాలు కోల్పోయినట్టు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో అటు కొంకాపల్లి సంబరంలోను, ఇటు బండారులంకలోను విషాదఛాయలు అలుముకున్నాయి. సాయివినయ్ బీటెక్ పూర్తిచేసి ఈ నెల 16వ తేదీన హైదరాబాద్‌లో ఉద్యోగంలో చేరాల్సి ఉంది. ఇంతలోనే మృత్యువాతపడడంతో ఆ కుటుంబ సభ్యుల రోదనలు వర్ణనాతీతం. సాయివినయ్ మృతికి సంబంధించి ఎటువంటి ఫిర్యాదు అందకపోవడంతో అమలాపురం పట్టణ పోలీసులు కేసు నమోదు చేయలేనట్టు తెలిసింది.

టెంట్ కడుతుండగా గోడపై నుంచి కిందపడి...



వీర్రాఘవరెడ్డి (పాత చిత్రం)

అనపర్తి, అక్టోబరు 13: తూర్పు గోదావరి జిల్లా అనపర్తి మండలం పొలమూరులో శరన్నవరాత్రి అన్నసమారాధనలో అపశ్రుతి జరిగింది. ప్రమాదవశాత్తూ ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ శ్రీనునాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సత్తి గంగిరెడ్డి, ఆయన కుమారుడు వీర్రాఘవరెడ్డి (33) టెంట్ హౌస్ నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం అమ్మవారి ఉత్సవాల ముగింపు సందర్భంగా జరిగే అన్నసమారాధనకు టెంట్ ఏర్పాటు చేసేందుకు వెళ్లిన వీర్రాఘవరెడ్డి గోడపై నిలుచుని తాడును కట్టే క్రమంలో అదుపు తప్పి సిమెంట్ రోడ్డుపై పడిపోయాడు. దీంతో అతడి తలకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు అనపర్తి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. వీర్రాఘవరెడ్డికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్టు ఎస్ఐ చెప్పారు.




వేదమూర్తి, వీరబ్రహ్మం (పాత చిత్రాలు)

గోదావరిలో స్నానానికి దిగిన ఇద్దరు గల్లంతు

కె.గంగవరం, అక్టోబరు 13: శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు రెండు కుటుంబాల్లో విషాదం నింపింది. గోదావరిలో స్నానానికి దిగిన ఇద్దరు గల్లంతయ్యారు. స్థానికులు, పామర్రు ఎస్ఐ ఎస్‌కే జానీబాషా తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం రావిచెరువుకు చెందిన మేడిశెట్టి వీరబ్రహ్మం, నరాల వేదమూర్తి గ్రామస్తులతో కలిసి ఆదివారం కోటిపల్లి గోదావరి వద్దకు అమ్మవారి విగ్రహాన్ని నిమజ్జనానికి తీసుకువచ్చారు. నిమజ్జనం పూర్తయిన తర్వాత గోదావరిలో స్నానానికి దిగారు. నీటిని అంచనా వేయలేకపోవడంతో వారు మునిగిపోయారు. గజ ఈతగాళ్ల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి వరకు జాడ తెలియలేదు. గల్లంతైన వారు కుటుంబాలను కాయకష్టం చేసుకుని పోషించుకుంటున్నారు. ఇద్దరూ వివాహితులు. వేదమూర్తికి ఆరు నెలల క్రితమే పెళ్లయ్యింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ జానీబాషా చెప్పారు.

బాలికపై లైంగిక దాడి

ఆత్రేయపురం, అక్టోబరు 13: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో నాలుగేళ్ల బాలికపై ఓ యువకుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ నెల 11న మండలంలోని ఓ గ్రామానికి చెందిన నాలుగేళ్ల బాలికను రాత్రి సమయంలో అదే గ్రామానికి చెందిన నల్లూరి శివ అనే యువకుడు మాయమాటలు చెప్పి నిర్మానుష్య ప్రదేశానికి తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని ఆ బాలిక అమ్మమ్మకు చెప్పింది. ఈ నెల 12వ తేదీన ఆమె పోలీసులను ఆశ్రయించింది. దీనిపై పోక్సో కేసు నమోదు చేశారు. ఆదివారం శివను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండు విధించినట్టు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు.




రాజరాజేశ్వరి అలంకారంలో వనదుర్గ అమ్మవారు, సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లకు శమీపూజ నిర్వహిస్తున్న దృశ్యం

సత్యదేవుని సన్నిధిలో వేడుకగా దసరా

అన్నవరం, అక్టోబరు 13: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధిలో దసరా వేడుకలు నిర్వహించారు. దేవీ శరన్నవరాత్రుల్లో చివరి రోజైన శనివారం కనకదుర్గ, వనదుర్గ అమ్మవార్లు రాజరాజేశ్వరీ దేవిగా భక్తులను అనుగ్రహించారు. దర్బారు మండపంలో విశేష పూజలు, హోమ పూర్ణాహుతి గావించారు. రాత్రి ఏడు గంటలకు స్వామి, అమ్మవార్లను, వెండి గజవాహనంపై, సీతారాములను పల్లకిలో మేళతాళాలతో కొండ దిగువన హైస్కూలు వద్దకు తోడ్కొని వచ్చి అర్చకులు శమీ పూజ నిర్వహించారు. 'శమీ శమయతే పాపం శమీ శత్రువినాశనీ అర్జునస్య ధనుర్ధారి రామస్య ప్రియదర్శిని' అను మంత్రం పఠించి శమీ వృక్షం చుట్టూ ముమ్మారు స్వామి, అమ్మవార్లను ప్రదక్షిణ గావించారు. అనంతరం కళాశాల మైదానం వద్దకు స్వామి, అమ్మవార్లను తీసుకెళ్లి విశేష అర్చనలు చేశారు. కళ్లు మిరుమిట్లు గొలిపే బాణసంచా కాల్పుల నడుమ సహాయ కమిషనర్ విశ్వనాథరాజు, సీహెచ్ రామ్మోహనరావు విల్లు ఎక్కుపెట్టి రావణ దహనం చేశారు. అన్నవరం, పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి తిలకించారు.




విజేతలుగా నిలిచిన తూర్పు గోదావరి జిల్లా బాలురు, బాలిక జట్లకు ట్రోఫీలు అందజేస్తున్న అమలాపురం ఎంపీ హరీష్‌మాధుర్

'తూర్పు'దే పైచేయి

- ముగిసిన అంతర్ జిల్లా బాస్కెట్‌బాల్ టోర్నీ
- బాలురు, బాలికల విభాగాల్లో విజేత 'తూర్పు గోదావరి'
- రన్నరప్‌గా అనంతపురం బాలురు, కృష్ణా బాలికలు

రామచంద్రపురం (ద్రాక్షారామ), అక్టోబరు 13: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలోని కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో మూడు రోజుల పాటు జరిగిన జీఎంసీ బాలయోగి స్మారక ఏపీ సబ్ జూనియర్స్ 9వ అంతర్ జిల్లా బాస్కెట్‌బాల్ టోర్నీ శనివారం ముగిసింది. బాలురు, బాలికల విభాగాల్లో తూర్పు గోదావరి జట్లు విజేతలుగా నిలిచాయి. బాలురు విభాగంలో అనంతపురం జట్టు, బాలికల విభాగంలో కృష్ణా జట్టు రన్నరప్‌గా నిలిచాయి. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభకు అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రథమ, ద్వితీయ తృతీయ స్థానాల్లో నిలిచిన జట్లకు ట్రోఫీలు, క్రీడాకారులకు మెడల్స్ అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఎన్డీఏ ప్రభుత్వం విద్య, క్రీడా రంగాలకు అత్యధిక ప్రాధాన్యమివ్వాలని నిర్ణయించిందన్నారు. అమలాపురంలో తన తండ్రి, లోక్‌సభ దివంగత స్పీకర్ జీఎంసీ బాలయోగి నిర్మించిన స్టేడియాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దుతామన్నారు. రామచంద్రపురంలో బాస్కెట్‌బాల్ కోర్టును సింథటిక్ కోర్టుగా అభివృద్ధి చేయడానికి తన వంతు సహకరిస్తానని ప్రకటించారు. బాస్కెట్‌బాల్ ఇండోర్ స్టేడియం నిర్మించబోతున్నామని ప్రకటించారు. రిఫరీ డేవిడ్ అంతర్జాతీయ స్థాయి రిఫరీగా ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఫైనల్ మ్యాచ్‌లను చూస్తే పాత జ్ఞాపకాలు గుర్తుకొచ్చాయన్నారు.

జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ తూర్పు గోదావరి అభివృద్ధికి బాలయోగి చేసిన కృషి మరువలేనిదని, ఆయన బాటలోనే హరీష్ మాధుర్ పయనిస్తూ రామచంద్రపురంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కోరారు. రామచంద్రపురంలో బాస్కెట్‌బాల్ క్రీడను నిరంతరం ప్రోత్సహిస్తున్న గన్నమని చక్రవర్తిని అభినందించారు. బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్ ఏపీ ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి మాట్లాడుతూ బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు ఎంపీగా గెలుపొంది నేడు ట్రోఫీ ప్రదానోత్సవ సభలో ముఖ్య అతిథిగా పాల్గొనడం ఆనందదాయకమన్నారు. రామచంద్రపురంలో కోర్టుల అభివృద్ధి పనులు పూర్తయితే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే జట్లకు రాష్ట్ర స్థాయి కోచింగ్ క్యాంపు ఇక్కడే నిర్వహిస్తామని ప్రకటించారు.

మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కోశాధికారి డాక్టర్ కోట సతీష్‌కుమార్ మాట్లాడారు. ఎంపీ హరీష్‌మాధుర్‌ను అసోసియేషన్ తరఫున ఘనంగా సత్కరించారు. పీడీగా పనిచేస్తూ ఎంఈవో నియమితులైన అప్పాజీ, అంతర్జాతీయ రిఫరీగా ఎంపికైన డేవిడ్, క్లినిక్‌కి ఎంపికైన షాబుద్దీన్ బేగ్‌లను ఎంపీ హరీష్ సత్కరించారు. డాక్టర్ చెలికాని రామారావు, జిల్లా కార్యదర్శి మాణిక్యాలరావు, గొల్లపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్టు

- రూ.5 లక్షలు విలువైన బంగారు ఆభరణాలు, కారు స్వాధీనం
- 24 గంటల్లోనే చేధించిన పోలీసులు




వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాస్, ఎస్ఐ నాగబాబు (పైన). స్వాధీనం చేసుకున్న బంగారు వస్తువులు, సెల్‌ఫోన్లు (కింద)

గండేపల్లి, అక్టోబరు 13: బంగారు ఆభరణాలు కనిపించకపోవడంపై నమోదైన కేసును జగ్గంపేట సీఐ వైర్కే శ్రీనివాస్ నేతృత్వంలో గండేపల్లి ఎస్ఐ యూటీ శివనాగబాబు 24 గంటల్లోనే చేధించారు. సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తు చేసి అంతర్ జిల్లా దొంగల ముఠాను అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను కాకినాడ జిల్లా గండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో సీఐ శ్రీనివాస్, ఎస్ఐ శివనాగబాబు శనివారం సాయంత్రం వెల్లడించారు. విశాఖపట్నానికి చెందిన మొల్లేటి సుగుణ ఈ నెల 7న తన ఇద్దరు పిల్లలతో కలిసి ఏలేశ్వరంలోని అక్క ఇంటికి వచ్చి అక్కడి నుంచి అమ్మమ్మ ఊరు గండేపల్లి మండలం మురారి వెళ్లేందుకు ఆటో ఎక్కింది. ఈ సమయంలో ఆటోలో గుర్తు తెలియని వ్యక్తులు ఆమె బ్యాగులో ఉన్న బంగారు వస్తువులను దొంగలించారు. ఆమె ఇంటికి వెళ్లి బ్యాగు తెరిచి చూడగా బంగారు వస్తువులు కనిపించకపోవడంతో గండేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. వెంటనే అప్రమత్తమైన వారు సాంకేతిక పరిజ్ఞానంతో నిఘా పెట్టి ఈ నెల 12న మురారి శివారున అంతర్ జిల్లా దొంగలను అరెస్టు చేశారు. అనకాపల్లి జిల్లా మాడుగులకు చెందిన రావుల దుర్గ, మేరకనపల్లి వెంకటేశ్వరరావు, విజయనగరం జిల్లా కొత్తవలసకు చెందిన గంటా రేవతి, అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం గొట్లం గ్రామానికి చెందిన రావుల వసంత, తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలానికి చెందిన నాగులూరి శివపార్వతిని అరెస్టు చేశారు. వీరిపై పాత కేసులు ఉన్నట్టు గుర్తించారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి సుమారు రూ.5లక్షలు విలువైన 100 గ్రాముల బంగారు ఆభరణాలు, టాటా ఇండిగో సీఎస్ కారు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచారు. ఈ కేసును త్వరితగతిన చేధించిన జగ్గంపేట సీఐ వైఆర్కే శ్రీనివాస్, గండేపల్లి ఎస్ఐ యూవీ శివనాగబాబు, ఏఎస్ఐ చంద్రశేఖర్, సిబ్బంది వీరబాబు, బాషా, సూరిబాబులను ఉన్నతాధికారులు అభినందించారు.



అనపర్తి మాజీ ఎమ్మెల్యే కారుకు ప్రమాదం

ద్రాక్షారామ, అక్టోబరు 13: అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి ప్రయాణిస్తున్న కారు ఆదివారం డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం అంబికపల్లి అగ్రహారం వద్ద ప్రమాదానికి గురైంది. రామచంద్రపురం వైపు నుంచి వస్తున్న కారు, ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొన్నాయి. దీంతో కారు ముందు భాగం దెబ్బతింది. ఆటో తిరగబడిపోవడంతో అందులో ప్రయాణిస్తున్న ముగ్గురికి స్వల్ప గాయాలైనట్టు తెలిసింది. ఆటో డ్రైవరు కూడా గాయపడ్డాడు. క్షతగాత్రులను మాజీ ఎమ్మెల్యే తన కారులో ఆసుపత్రికి తరలించి ఆయన మరో కారులో వెళ్లారు.

కారును ఢీకొన్న బైక్: ఇద్దరికి తీవ్ర గాయాలు

క్షతగాత్రుల బ్యాగ్‌లో 15 కిలోల గంజాయి గుర్తింపు

గోకవరం, అక్టోబరు 13: ఏజెన్సీ ప్రాంతమైన మారేడుమిల్లి నుంచి మోటారు సైకిలుపై ఇద్దరు వ్యక్తులు అతివేగంతో రాజమహేంద్రవరం వైపునకు వెళ్తుండగా గోకవరం గ్రామ శివారున ఎదురుగా వస్తున్న కారును ఢీకొని ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు సపర్యలు చేస్తుండగా వారి వద్ద బ్యాగ్‌లో ఉన్న గంజాయిని పోలీసులు గుర్తించారు. వారిని ఎన్టీఆర్ జిల్లా కంకిపాడు మండలం మాదాసువారిపాలేనికి చెందిన జ్యోతి ప్రకాష్, ప్రతాప్‌గా గుర్తించి సుమారు 15 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. క్షతగాత్రులను ప్రథమ చికిత్స నిమిత్తం గోకవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్య సహాయం నిమిత్తం ఒకరిని కాకినాడ, మరొకరిని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రులకు తరలించారు. నిందితులు కోలుకున్నాక వారి నుంచి పూర్తి సమాచారం సేకరించి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు చెప్పారు.



క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

కట్టమూరులో చైన్ స్నాచింగ్



బాధితురాలు భూలక్ష్మి

పెద్దాపురం, అక్టోబరు 13: పట్టపగలే మహిళ మెడలో బంగారు గొలుసును బైక్‌పై వచ్చి లాక్కుపోయారు. కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం కట్టమూరుకు చెందిన సిద్దన భూలక్ష్మి విజయదశమి రోజైన శనివారం ఉదయం కనకదుర్గ ఆలయానికి నడుచుకుంటూ బయల్దేరింది. ఇంతలో ఇద్దరు యువకులు బైక్‌పై వచ్చి ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కుని పరారయ్యారు. స్థానికులు వారిని పట్టుకునే ప్రయత్నం చేసినా దొరకలేదు. బంగారు గొలుసు సుమారు మూడు కాసులు ఉంటుందని బాధిత మహిళ తెలిపింది. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు విచారణ చేపట్టారు.

మినీ బస్సును ఢీకొట్టిన ఐషర్ వ్యాన్

కొవ్వూరు గామన్ బ్రిడ్జి దాటాక ఘటన: మహిళ మృతి, ఏడుగురికి గాయాలు

కొవ్వూరు, అక్టోబరు 13: భవానీ భక్తులు వెళ్తున్న మినీ బస్సును ఐషర్ వ్యాన్ ఢీకొట్టిన ప్రమాదంలో మహిళ మృతి చెందగా ఏడుగురికి గాయాలయ్యాయి. అనకాపల్లి జిల్లా పరవాడ మండలం కలపాక గ్రామానికి చెందిన 27 మంది భవానీలు మినీ బస్సులో విజయవాడ కనకదుర్గ అమ్మవారి దర్శనానికి బయల్దేరారు. శనివారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో కొవ్వూరు గామన్ బ్రిడ్జి టోల్‌గేటు దాటిన తర్వాత దొమ్మేరు వైపు ఆగారు. ఆగి ఉన్న బస్సును రాజాం నుంచి పురికోస లోడుతో చిత్తూరు జిల్లా మదనపల్లి వెళుతున్న కర్ణాటకకు చెందిన ఐషర్ వ్యాన్ వెనుక నుంచి ఎడమ పక్కన ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు వెనుక రెండు సీట్లు పూర్తిగా దెబ్బతినడంతో పోలవరపు అప్పలనరసమ్మ (55) మృతి చెందింది. ఇదే ప్రమాదంలో పోలవరపు త్రిష్న, పి.నిహారిక, కురం భార్గవి, కె.నాగలక్ష్మి, ఇందల చిన్నమ్మ, ఈ.రామానాయుడు, వనం కిషోర్ గాయాలపాలయ్యారు. వీరిని రోడ్డు సేఫ్టీ సిబ్బంది కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో రోడ్డు ప్రమాదంలో 20 మందికి గాయాలు...

అనకాపల్లి జిల్లా నర్సీపట్నం మండలం దుగ్గాడ గ్రామానికి చెందిన భవానీ భక్తులు రెండు టాటా ఏస్ వాహనాల్లో విజయవాడ వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో 20 మందికి గాయాలయ్యాయి. వీరి వాహనాల్లో ఒకటి మరమ్మతులకు గురికావడంతో ఒకదానికొకటి కట్టుకుని తిరిగి ఇంటికి బయల్దేరారు. కొవ్వూరు టోల్‌ప్లాజా సమీపంలోని బ్రిడ్జి దాటుతుండగా టాటా ఏస్ వాహనాన్ని లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో రెండు టాటా ఏస్ వాహనాలు బోల్తాపడ్డాయి. ఈ ప్రమాదంలో 20 మందికి స్వల్ప గాయాలయ్యాయి. రాత్రి గస్తీలో ఉన్న పట్టణ సీఐ పి.విశ్వం క్షతగాత్రులను చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరంలోని ఆసుపత్రులకు తరలించారు.



కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భవానీ భక్తులు





శతకోటి కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

శ్రీపీఠంలో ముగిసిన మహాశక్తి యాగం

శతకోటి కుంకుమార్చనలో పాల్గొన్న వేలాది మంది మాతృమూర్తులు

సర్పవరం జంక్షన్, అక్టోబరు 13: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా కాకినాడ శ్రీపీఠంలోని గోశాల ప్రాంగణంలో స్వామి పరిపూర్ణానంద సరస్వతి ఆధ్వర్యంలో 11 రోజులు జరిగిన మహాశక్తి యాగం ఘనంగా ముగిసింది. శతకోటి (100 కోట్ల) కుంకుమార్చన మహాక్రతువు శనివారం పూర్తయ్యింది. యాగశాలలో 9.27 లక్షల బగళాముఖి యాగం, 1325 రుద్ర, 330 చండీ, లక్ష విశేష దేవతా హోమాలు దిగ్విజయంగా పూర్తయ్యాయని స్వామీజీ చెప్పారు. 12 లక్షల గాయత్రీ మంత్ర అనుష్ఠానం జరిగింది. శనివారం ఐశ్వర్యాంబిక అమ్మవారు రజత కవచ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మహాశక్తి యాగంలో చివరి రోజైన ఆదివారం ఉదయం ఐశ్వర్యాంబిక అమ్మవారు శ్రీవేంకటేశ్వరస్వామి దివ్యాలంకరణలో భక్తులను అనుగ్రహించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎన్నడూ జరగని రీతిలో మహాశక్తి యాగాన్ని వేలాది మంది మాతృమూర్తులతో దిగ్విజయంగా పూర్తి చేశామని, అంతా అమ్మ అనుగ్రహమేనన్నారు. వేలాది భక్తులకు అన్నప్రసాద వితరణ చేసిన దాతలు, వలంటీర్లు, ఇతర సేవకులు, బందోబస్తు కల్పించిన ఎస్పీ విక్రాంత్ పాటిల్, సారథ్యం వహించిన డీఎస్పీ రఘువీర్, సర్పవరం, కాకినాడ రూరల్ సర్కిల్, ట్రాఫిక్, టౌన్ సీఐలు బి.పెద్దిరాజు, డీఎస్ చైతన్యకృష్ణ, డి.రామారావు, పోలీసు అధికారులు, సిబ్బందికి స్వామీజీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



గోపిమూర్తి పరిచయ సభలో ఐక్యత చాటుతున్న నాయకులు

పీడీఎఫ్ ఎమ్మెల్సీలది ప్రజా పక్షం

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పరిచయ సభలో వక్తలు

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 13: పీడీఎఫ్ ఎమ్మెల్సీలుగా గెలిచిన వారంతా శాసనమండలిలో ప్రజా సమస్యలపై గళం విప్పారని, ప్రజాపక్షాన నిలిచి సమస్యల పరిష్కారానికి కృషి చేశారని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్ పేర్కొన్నారు. త్వరలో జరగనున్న ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఉప ఎన్నికలో పీడీఎఫ్ ఎమ్మెల్సీగా అభ్యర్థిగా పోటీ చేయనున్న బొర్రా గోపిమూర్తి పరిచయ సభ తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఆదివారం జరిగింది. గోపిమూర్తి అభ్యర్థిత్వాన్ని పీడీఎఫ్ ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు ప్రతిపాదించగా నాయకులు సంఘీభావం ప్రకటించారు. గోపిమూర్తి మాట్లాడుతూ తనను గెలిపిస్తే ఉపాధ్యాయులు, ప్రజల సమస్యలను శాసనమండలిలో ప్రశ్నిస్తానన్నారు. కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ నాయకులు గాంధీ, ప్రభాకర్ మాట్లాడారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణకుమారి అధ్యక్షతన జరిగిన సభలో తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జయకర్, షరీఫ్, జ్యోతిబసు, పెంకే వెంకటేశ్వరరావు, తోటకూర చక్రవర్తి, నగేష్, అన్నారాం, విల్సన్, మహేష్‌రావు, సీనియర్ నాయకులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవికి రూ.10లక్షలు విలువైన బంగారు, వెండి ఆభరణాలు సమర్పణ



కోరుకొండ, అక్టోబరు 13: తూర్పు గోదావరి జిల్లా కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్ వక్షస్థలంలో ఉన్న లక్ష్మీదేవికి బంగారు కిరీటాన్ని కోరుకొండ మండలం నర్సాపురం గ్రామానికి చెందిన బొల్లెంపల్లి ఆదినారాయణమూర్తి, బొల్లెంపల్లి మాధవరావు కుటుంబ సభ్యులు బహూకరించారు. విజయదశమి సందర్భంగా ప్రత్యేక పూజల అనంతరం కిరీటాన్ని అమ్మవారికి అలంకరించారు. ఆలయంలో లక్ష్మీదేవికి సుమారు రూ.4లక్షలతో వెండి కిరీటం, కవచం, చీరలను కోరుకొండకు చెందిన కప్పల వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులు బహూకరించారు. గోదాదేవికి వెండి మకరతోరణాన్ని, అభిషేక సమయంలో వినియోగించేందుకు వెండి చక్రాన్ని భక్తులు అందజేశారు. నూతన బంగారు, వెండి వస్తువులకు సంప్రోక్షణ నిర్వహించి ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారికి అలంకరించారు. వీటి విలువ సుమారు రూ.10లక్షలు ఉంటుందని ధర్మకర్త రంగరాజ భట్టర్, అన్నవరం దేవస్థానం అధికారులు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

సామర్లకోట, అక్టోబరు 13: కాకినాడ జిల్లా సామర్లకోట మండలంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ దుర్మరణం చెందింది. తాళ్లరేవు మండలం జార్జిపేటకు చెందిన దొంతిన ఆదిలక్ష్మి (60 తన భర్తతో కలిసి మోటారు సైకిలుపై పెద్దాపురం వెళ్తోంది. వీకే రాయపురం సమీపించే సరికి రోడ్డుపై ఉన్న గొయ్యిని తప్పించే ప్రయత్నంలో బైక్ గోతిలో పడి అదుపు తప్పింది. వెనుక కూర్చున ఆదిలక్ష్మి రోడ్డుపై పడడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందింది. సంఘటనా స్థలంలో మృతురాలి భర్త రోదించిన తీరు పలువురిని కలచివేసింది. సామర్లకోట పోలీసులు వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సామర్లకోట పోలీసులు చెప్పారు.

ప్రమాదవశాత్తు పెయింటర్ మృతి



మృతుడు నాని (పాత చిత్రం)

సామర్లకోట, అక్టోబరు 13: కాకినాడ జిల్లా సామర్లకోట మండలం పవరలో ఒక భవనానికి పెయింటింగ్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తూ భవనంపైనుంచి కిందికి పడి ఇద్దరు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. వారిని సహచర కూలీలు ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స మధ్యలోనే ఒక వ్యక్తి మృతి చెందాడు. అతడిని పిఠాపురం రథాలపేటకు చెందిన కొమ్ము నాని(25)గా పోలీసులు గుర్తించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మరో వ్యక్తి పరిస్థితి విషమంగా ఉందని వైద్యవర్గాల ద్వారా తెలిసింది. కాగా మృతుని కుటుంబానికి న్యాయం చేయాలంటూ అతడి కుటుంబ సభ్యులు ప్రమాదం జరిగిన భవనం ముందు ఆందోళనకు దిగారు. భవన యజమానితో కుటుంబీకులతో పాటు పోలీసులు చర్చలు ప్రారంభించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సామర్లకోట పోలీసులు చెప్పారు.

నేడు 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ'

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 13: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్టు కాకినాడ నగర పాలక సంస్థ కమిషనర్ భావన ఓ ప్రకటనలో తెలిపారు. కాకినాడ నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో ఉదయం 9.30 గంటల నుంచి డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం, తదుపరి 10 గంటల నుంచి ఒంటి గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం • తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

ప్రొఫెసర్ సాయిబాబాకు నివాళి

గొల్లప్రోలు, అక్టోబరు 13: పీడిత ప్రజల విముక్తి కోసం, పేద ప్రజల పక్షాన ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్, మానవహక్కుల నేత, ప్రముఖ రచయిత ప్రొఫెసర్ సాయిబాబా చేసిన పోరాటం ఎనలేనిదని ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం, అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య నాయకులు అన్నారు. గొల్లప్రోలు జగనన్న కాలనీ వద్ద ఆదివారం సాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఐఎఫ్‌టీయూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కుంచే అంజిబాబు, నాయకులు డి.నారాయణమూర్తి, కేశవరపు వీరన్న, గొర్ల శివ,బళ్ల సోమరాజు ఉన్నారు.

ప్రత్తిపాడు: ప్రొఫెసర్ సాయిబాబా మృతికి ఐలాజ్ రాష్ట్ర కమిటీ సభ్యులు బుగతా శివ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. సుదీర్ఘమైన, క్రూరమైన జైలు శిక్ష ప్రొఫెసర్ సాయిబాబా ఆరోగ్యాన్ని కోలుకోలేని విధంగా దెబ్బతీసిందని ఆయన పేర్కొన్నారు.

జగ్గంపేట: ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా మృతి ప్రభుత్వ హత్యేనని రైతు కూలీ సంఘం నేత కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. రంగవల్లినగర్‌లో రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో సాయిబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

'పిఠాపురం అభివృద్ధికి తపిస్తున్న పవన్'

పిఠాపురం, అక్టోబరు 13: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు ప్రజాసమస్యలపై డిప్యూటీ సీఎం స్పందించి పరిష్కరిస్తున్న తీరును ప్రజల్లోకి తీసుకెళ్తామని నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని సీతయ్యగారితోటలో నూతనంగా ఏర్పాటు చేసిన జనసేన పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ పల్లె పండుగ కార్యక్రమంలో గ్రామాల్లో రూ.11కోట్లపైగా నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నట్టు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం పవన్ నిరంతరం తపిస్తున్నారని, ఎప్పటికప్పుడు కలెక్టర్, ఇతర అధికారులతో మాట్లాడుతూ అన్ని అంశాలపై చర్చిస్తున్నారని తెలిపారు. అన్నిరంగాల్లో నియోజకవర్గాన్ని ముందుంచే దిశగా అడుగులు పడుతున్నాయని చెప్పారు. జనసేన నాయకులు, వీరమహిళలు, జనసైనికులున్నారు.

'దళితుల ఐక్యత కోసం రాజీలేని పోరాటం'

కాకినాడ సిటీ, అక్టోబరు 13: దళితుల ఐక్యత కోసం రాజీలేని పోరాటం చేస్తామని, అన్నింటికీ ఐకమత్యమే పరిష్కారమని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సరిపెల్ల రాజేష్ అన్నారు. ఎస్సీ వర్గీకరణ, మతస్వేచ్ఛ అంశాలపై అన్నింటికీ పరిష్కారం ఐక్యతే నినాదంతో కాకినాడలోని అంబేడ్కర్ భవన్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. సమావేశానికి కాకినాడ టీడీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొల్లాబత్తుల అప్పారావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మహాసేన రాజేష్ మాట్లాడారు. సమావేశంలో భీమ్ ఆర్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు పిల్లి శివకుమార్, దళిత నాయకులు బచ్చుల కామేశ్వరరావు, యాదాల సత్యనారాయణ, బంగారు సత్యనారాయణ ఉన్నారు.

'ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలి'

గండేపల్లి, అక్టోబరు 13: ఆటోలు, బస్సులు, ఇతర వాహనాల్లో ప్రయాణాలు చేసే సమయాల్లో ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని గండేపల్లి ఎస్ఐ యువి శివనాగబాబు సూచించారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రయాణాల్లో ముఖ్యంగా మహిళలు బంగారు వస్తువులు, ఇతర వాటిని జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. ఇటీవల దొంగలు ముఠాగా ఏర్పడి కుటుంబం మాదిరి ప్రవర్తిస్తూ ప్రయాణికులతో కలిసిపోతున్నారు. ప్రయాణికులు తమ చుట్టూ ఉండే వారిని గమనించాలని, వస్తువుల పట్ల జాగ్రత్త వహించాలని, ఫోన్లో నిమగ్నం అయిపోకూడదని ఆయన కోరారు.

రావులమ్మకు వెండి గరగ సమర్పణ

జగ్గంపేట, అక్టోబరు 13: విజయదశమి పురస్కరించుకుని జగ్గంపేట గ్రామదేవత రావులమ్మవారికి ఆలయ ధర్మకర్తలందరూ కలిసి వెండి గరగ తయారు చేయించి అందజేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ‌రామణి దంపతులు, జిల్లా టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి గరగను సమర్పించారు. కార్యక్రమంలో ఎస్‌వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను వెంకట్రావు, జీను పెద రాంబాబు, జీను సోంబాబు, జీను సత్తిబాబు, గెడ్డమూరి బాబ్జి పాల్గొన్నారు. స్థానిక పద్మనాభనగర్‌లో గల చెరువు గట్టుపై ఉన్న కనకదుర్గ దసరా మహోత్సవాలు జరిగాయి. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మణి దంపతులు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించి తెప్పోత్సవంలో పాల్గొన్నారు.

తాళ్ళూరులో ప్రత్యేక పూజలు

గండేపల్లి, అక్టోబరు 13: మండలంలోని తాళ్ళూరు జియ్యన్న మఠంలో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామివారి జన్మనక్షత్రమైన శ్రవణ నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ దాపర్తి సీతారామయ్య ఆధ్వర్యంలో అర్చకులు సుగంధ ద్రవ్యాలు, పంచామృతాలతో అభిషేకం చేశారు. అర్చకులు ఎంఎస్ భాస్కరాచార్యులు, రమేష్ ఆచార్యులు, ఎంవీ.మూర్తి ఆచార్య లు, ఏకాంగి ఎం.సాయిఆచార్యులు, ఆలయ వంశపారంపర్య అర్చకులు జనార్ధన వరాహ నరసింహాచార్యులు, గ్రామ నాయకులు పాలచర్ల సత్యనారాయణ, ఒబిణి సత్యనారాయణ, మాజీసర్పంచ్ పి.వెంకటేశ్వరరావు, కోండ్రు అప్పలరాజు, ఒబిణి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కొత్తపల్లి, అక్టోబరు 13: ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన అమీనబాద్‌లో జరిగింది. కూలీ పనులు చేసుకునే కుండల రాజుకు ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ జీవితం పై విరక్తితో శనివారం పురుగుమందు తాగాడు. అతడిని కుటుంబసభ్యులు వెంటనే కొత్తపల్లి పీహెచ్‌సీ తరలించి పరిస్థితి విషమించడంతో కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు.

23 మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్ట్

ప్రత్తిపాడు, అక్టోబరు 13: కిరాణా షాపుల్లో అక్రమంగా మద్యం విక్రయాలు జరుపుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసి 23 మద్యం బాటిల్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఎస్ఐ లక్ష్మీకాంతం అందించిన సమాచారంమేరకు మండలంలోని ధర్మవరంలో శ్రీదుర్గాభవాని కిరాణా జనరల్ స్టోర్స్‌లో అక్రమంగా లిక్కర్ బాటిల్స్ అమ్ముతున్నారనే సమాచారం రావడంతో ఎస్ఐ ఎస్.లక్ష్మీకాంతం, పోలీసులు ఆ దుకాణంపై దాడి చేశారు. వివిధ బ్రాండ్‌లకు చెందిన 23 లిక్కర్ బాటిల్స్ లభించగా వాటిని సీజ్ చేసి కిరాణా షాపుయజమానిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్టు పోలీసులు తెలిపారు.

కత్తితో వ్యక్తిపై దాడి

రౌతులపూడి, అక్టోబరు 13: కాకినాడ రూరల్ తూరంగికి చెందిన వేగిశెట్టి సూర్యకృష్ణారావుపై రౌతులపూడి, ఉప్పంపాలెం గ్రామాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు కత్తితో దాడి చేసి గాయపరిచారు. ఈ సంఘన శనివారం మధ్యాహ్నం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం...సూర్యకృష్ణారావు ఉప్పంపాలెంలో తన పొలంలో పని చేస్తుండగా లింగం గంగాధర్, బచ్చా యర్రయ్య పొలం విషయంలో గొడవకు దిగారు. ఇద్దరు కొట్టుకున్నారు. కత్తితో గంగాధర్, యర్రయ్యలు కృష్ణారావు తలపై కత్తితో దాడి చేయగా బలమైన గాయమైంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

తొండంగి, అక్టోబరు 13: పెరుమాళ్ళపురం వద్ద సముద్రంలో మునిగి గల్లంతైన వ్యక్తి మృతదేహం శనివారం సాయంత్రం లభించినట్టు తొండంగి ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. బీహార్‌కు చెందిన వినయ్‌కుమార్ (21) శుక్రవారం పెరుమాళ్లపురం వద్ద సముద్రంలో స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు మునిగి గల్లంతు కాగా అక్కడే మృతదేహం లభించినట్టు తెలిపారు.

ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు

పిఠాపురం, అక్టోబరు 13: పట్టణంలోని పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వరస్వామి సన్నిధిలో వేంచేసి ఉన్న రాజరాజేశ్వరీదేవి, పురుహూతికాఅమ్మవారి శరన్నవరాత్ర శతచండీయాగ మహోత్సవాల్లో భాగంగా చివరి రోజు ప్రత్యేకపూజలు జరిగాయి. విజయదశమి పర్వదినాన రాజరాజేశ్వరిదేవిని విజయదుర్గగా అలంకరించారు. అమ్మవారికి లక్షకుంకుమార్చన జరిగింది. పురుహూతికా అమ్మవారికి సహస్ర పుష్పార్చన, శ్రీచక్ర లక్ష కుంకుమార్చన, రాజరాజేశ్వరీదేవికి సామూహిక విశేష కుంకుమార్చనలు, సాయంకాల ప్రత్యేకార్చనలు, మహా నివేదన, చతుర్వేత స్వస్తి నిర్వహించారు. పదిరోజులు పాటు పురుహూతికాఅమ్మవారికి జరిగిన చండీహోమానికి మహాపూర్ణాహుతి జరిగింది. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ఆలయ ఈవో, సహాయ కమిషనర్ పి.విశ్వనాథరాజు తదితరులు పాల్గొన్నారు. విజయదశమి సందర్భంగా గుట్ల వీధి కనకదుర్గ మ్మ ఆలయం వద్ద నుంచి నిర్వహించిన సంబరాలు ఆకట్టుకున్నాయి. వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కూరగాయల మార్కెట్‌లో దసరా సంబరాలు అంబరాన్నంటాయి. పలు ఆలయాల్లో మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ పూజలు చేశారు. పట్టణంలోని రథాలపేటలో జరిగిన దసరా పూజల్లో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ పాల్గొన్నారు. కనకదుర్గమ్మ వారిని దర్శించుకుని పూజలు చేశారు. బల్లా నవీన్, వంశీ పాల్గొన్నారు.

సామర్లకోట: దేవీశరన్నవరాత్రి ఉత్సవపూజలు సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో బాలా త్రిపుర సుందరి అమ్మవారితో బాటూ పలు అమ్మవార్ల ఆలయాల్లో శని, ఆదివారాలలో విశేష పూజలు నిర్వహించారు. భీమేశ్వరాలయంలో నిర్వహించిన ముగింపు పూజల్లో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కటుంసభ్యులు పాల్గొన్నారు. సరస్వతి మందిరం వద్ద రాజప్ప మనుమడికి శాస్త్రోక్తంగా అక్ష రాభ్యాసం పూజలు నిర్వహించారు. నందిమండపం వద్ద రాజప్ప కుటుంబ సభ్యులకు పండితుల వేదాశీర్వచనం చేసి ప్రసాదాలు అందజేసారు. భీమేశ్వరాలయంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ముగింపులో భాగంగా శనివారం అమ్మవారిని శ్రవణానక్షత్రమందు 80 కిలోల పరిమాణంలో గల వెండిచీరతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అధికంగా భక్తులు దర్శించుకున్నారు.

పోర్టుసిటీ(కాకినాడ): శ్రీబాలాత్రిపురసుందరి సమేత శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయంలో దసరా శరన్నవరాత్రులు ముగింపు పురస్కరించుకుని ఆదివారం భారీ అన్నదానం నిర్వహించారు. శనివారం అమ్మవారు బంగారు చీర అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చండీ హోమంలో పాల్గొని దేవాలయంలో భారీ అన్నాదానాన్ని ప్రారంభించారు. దేవాలయం ప్రధాన అర్చకులు చెరుకూరి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నవవరణార్చన పూజలు, చండీహోమం, పూర్ణాహుతి పూజలు జరిగాయి. ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంధి బాబ్జి, ఈవో వుండవల్లి వీర్రాజుచౌదరి ఏర్పాట్లను పర్యవేక్షించారు. టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, కూటమి నేతలు సంగిశెట్టి అశోక్, బోళ్ల కృష్ణమోహన్, నేమాని సత్యనారాయణ,నల్లూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.



గొల్లప్రోలు బస్టాండు వద్ద విశేష అలంకరణలో కనకదుర్గమ్మ



పెద్దాపురం భువనేశ్వరీ పీఠంలో రాజరాజేశ్వరిగా భువనేశ్వరీ

పిఠాపురం రూరల్: పిఠాపురం మండలం రాపర్తి గ్రామంలో దుర్గామల్లేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారిని పుష్పాలతో అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించి కుంకుమపూజలు చేశారు.

పిఠాపురం/గొల్లప్రోలు రూరల్: దసరా శరన్నవరాత్రులు ముగియడంతో ఆదివారం కనకదుర్గమ్మ శోభాయాత్రలు ఘనంగా జరిగాయి. పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలతో పాటు గొల్లప్రోలు మండలంలోని దుర్గాడ, చేబ్రోలు తదితర గ్రామాల్లో నిలిపిన కనకదుర్గమ్మ వారి విగ్రహాలను ట్రాక్టర్లు, వేన్‌లపై ఉంచి ప్రదర్శనగా నిమజ్జనానికి తరలించారు. కోలాటనృత్యాలు, అమ్మవార్ల వేషధారణలు, తీన్‌మార్ బ్యాండ్‌లుతో పట్టణాలు, గ్రామాల్లో కోలాహలం నెలకొంది. విగ్రహాలను ఏలేరు, పీబీసీ కాలువల్లో నిమజ్జనం చేశారు.

తొండంగి: ఏవి నగరం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుని ఆలయంలో అమ్మవారిని రాజరాజేశ్వరిదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అపరాజితా దేవికి శాస్త్రోక్తంగా పూజ నిర్వహించిన అనంతరం అర్చకులు వెంకన్న మిశ్రాలు శమీపూజ జరిపారు. ఆదివారం సత్యన్నారాయణ వ్రతం జరిపారు. పూజల్లో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు సతీమణి విజయలక్ష్మి పాల్గొన్నారు.

గొల్లప్రోలు: పట్టణంలోని బస్టాండు, కరణంగారి తోట, ఈబీసీ కాలనీ, నందిరాయువీధి, దేవినగర్ తదితర ప్రాంతాల్లోని ఆలయాల్లో అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. అమ్మవార్ల దర్శనానికి భక్తులు తెల్లవారుజాము నుంచే బారులు తీరారు. కుంకుమార్చనలు, సహస్ర నామార్చనలు జరిగాయి. బస్టాండు కనకదుర్గమ్మ ఆలయం వద్ద శమిపూజ నిర్వహించారు. ఆయా ఆలయకమిటీల ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

గొల్లప్రోలు రూరల్: దుర్గాడ శివాలయంలోని పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామి సన్నిధిలోని లలితాదేవి వనదుర్గ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి మూలవిరాట్టుకు వెండి చీరతో అలంకారం చేశారు. లలితా సహస్రనామ కుంకుమార్చన జరిగింది. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. తాటిపర్తి అపర్ణా సమేత నాగేశ్వరస్వామి ఆలయంలో అపర్ణాదేవిని ప్రత్యేకంగా అలంకరించారు. సామూహిక కుంకుమపూజలు జరిగాయి. రాత్రి ఆలయ ప్రాంగణంలోని జమ్మిచెట్టు వద్ద శమిపూజ చేశారు. చేబ్రోలు ముత్యాలమ్మతల్లి ఆలయం నుంచి చెందుర్తి సెంటర్‌లోని కనకదుర్గమ్మ ఆలయం వరకూ మహిళలు కలశాలతో ప్రదర్శనగా వెళ్లారు. కలశాలు అమ్మవారి ముందు ఉంచి పూజలు నిర్వహించారు. చేబ్రోలు శివారు సత్తెమ్మతల్లి ఆలయంలో దసరా ఉత్సవాలు ఘనంగా జరిగాయి. అమ్మవారిని పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు.భారీ అన్నసమారాధన జరిగింది. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పెద్దాపురం: పట్టణంలోని భువనేశ్వరీ పీఠంలో అమ్మవారు విజయదశమిరోజున రాజరాజేశ్వరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పీఠాధిపతి చింతా గోపీశర్మ ఆధ్వర్యంలో పీఠంలో ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పెద్దాపురం మరిడమ్మ దేవస్థానం, కాండ్రకోట నూకాలమ్మ దేవస్థానాల్లో శరన్నవరాత్రి మహోత్సవాలు ముగిశాయి. అలాగే సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు కనకదుర్గ, ధర్మవరంలో విజయదుర్గ, ఏలూరు, ఒమ్మంగి, దుర్గాభవానీల ఆలయాల వద్ద శమీ పూజలు చేశారు. జమ్మిచెట్టుకు ప్రత్యేక అలంకరణలు పూజలు నిర్వహించారు. ఆలయాలకు భక్తులు పెద్దఎత్తున రావడంతో కోలాహలంగా మారింది.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు
అమ్మవార్లకు విశేష అలంకరణలు
పలుచోట్ల అన్నదానాలు

ఘనంగా నిమజ్జనాలు



కొత్తపల్లి: కనకదుర్గను నిమజ్జనం చేస్తున్న భక్తులు

కొత్తపల్లి, అక్టోబరు 13: కొమరగిరి శివారు వెంకటరాయపురంలో విశేష పూజలందుకున్న దుర్గాదేవి నిమజ్జనం శనివారం ఘనంగా జరిగింది. అమ్మవారి విగ్రహాన్ని భక్తులు ఊరేగించి గ్రామ శివార్లలో పంట కాలువలో నిమజ్జనం చేసి స్నానాలచరించారు. కుతుకుదుమిల్లిలో జైభేతాళ నవరాత్రుల ఉత్సవాలు ముగిశాయి. కర్రసాములతో యువకులు సంబరాన్ని నిర్వహించారు.కుతుకడుమిల్లి, వాకతిప్ప, కొత్తపల్లి గ్రామాల మీదుగా భేతాళ సంబరాన్ని నిర్వహించి కొత్తపల్లి ఊరచెరువులో భేతాళస్వామిని నిమజ్జనం చేశారు.

ఏలేశ్వరం: దేవీనవరాత్రులు ముగియడంతో పట్టణంలో అమ్మవారి విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో శక్తి, పులి వేషాలు, బాణసంచా కాల్పులు, తీన్‌మార్ డాన్స్‌లతో పట్టణ వీధుల్లో ఊరేగించి ఏలేరు కాలువలో నిమజ్జనం చేశారు. జె.అన్నవరం గ్రామంలో విజయదుర్గ అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 1200 మందికి అన్నదానం చేశారు.

కిర్లంపూడి: దేవి నవరాత్రులు ముగింపు సందర్భంగా కిర్లంపూడి, జగపతినగరం, చిల్లంగి గ్రామాల్లో అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.

తుని రూరల్: గవరపేట గ్రామంలో అమ్మవారికి 100 రకాల పైబడి పిండి వంటకాలను సారెగా సమర్పించారు. తేటగుంటలో కనకదుర్గమ్మకు శోభాయాత్ర నిర్వహించారు. కోలాటం, తీర్మార్ ఆకట్టుకున్నాయి.

తపోవనంలో హోం మంత్రి అనిత పూజలు



రాజరాజేశ్వరికి పూజలు నిర్వహిస్తున్న అనిత

తుని రూరల్, అక్టోబరు 13: విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత తపోవన క్షేత్రంలో పూజలు ఆచరించారు. ఆశ్రమ పండితులు మంత్రికి పూర్ణకుంభ స్వాగతం పలకగా పీఠాధిపతి శ్రీ సచ్చిదానంద సరస్వతి స్వామిజీ ఆధ్వర్యంలో మంత్రి కుటుంబసభ్యులు పూజలు నిర్వహించారు. క్షేత్రంలో గల రాజరాజేశ్వరి అమ్మవారిని దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతమవ్వాలని,ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు నింపి విజయతీరాలకుచేర్చాలని అమ్మవారిని కోరినట్టు చెప్పారు.

జనసేనలో శివరామకృష్ణ చేరిక

జగ్గంపేట, అక్టోబరు 13: వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కర్రి శివరామకృష్ణ శనివారం జనసేనలో చేరారు. గోకవరం మండలం రంపయర్రంపాలెం పంచాయతీకి చెందిన శివరామకృష్ణ జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో పార్టీ కండువా కప్పుకుని జనసేనలో చేరారు.



జనసేన కండువా కప్పుతున్న తుమ్మలపల్లి

'మెరుగైన సేవలందించాలి'



ఎమ్మెల్యే కొండబాబును ఆహ్వానిస్తున్న ఉమాశంకర్

సర్పవరం జంక్షన్, అక్టోబరు 13: గొడారిగుంటలో లక్ష్మీ ఆసుపత్రి వెనుకాల ఛాయ స్కిన్ కేర్ క్లినిక్ నూతన భవనాన్ని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పతో కలసి ప్రారంభించారు. కొండబాబు మాట్లాడుతూ నిరుపేదలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. ప్రజల చర్మ సంబంధిత ఆరోగ్యాన్ని కాపాడేందుకు కాకినాడలోనే తొలిసారిగా అత్యాధునిక లేజర్ పరికరంతో అన్ని రకాల చర్మ వ్యాధులకు చికిత్స చేయడం జరుగుతుందని డాక్టర్‌కె. ఇందిర ప్రియదర్శిని తెలిపారు. ఆసుపత్రిలో లభించే సేవలను ఎమ్మెల్యేలకు వివరించారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఎండీ డాక్టర్ కె.ఉమాశంకర్, టీడీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ గుణ్ణం చంద్రమౌళి, రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్,పలువురు డాక్టర్లు పాల్గొన్నారు.

'ఉచిత గ్యాస్‌ను అందివ్వాలి'

తాళ్లరేవు, అక్టోబరు 13: రిలయన్స్ ఇండస్ట్రీ సంస్థ తాళ్లరేవు మండలంలోని ప్రతీ ఇంటికి ఉచిత గ్యాస్‌ను అందివ్వాలని సీపీఎం నేత కమిడి సత్యశ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం టేకుమూడి ఈశ్వరరావు అధ్యక్షతన నిర్వహించగా కమిడి మాట్లాడుతూ రిలయన్స్ సంస్థ తాళ్లరేవు మండలాన్ని దత్తత చేసుకుని అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు వల్లు రాజబాబు, దుప్పి అదృష్టదీపుడు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన వర్మ

పిఠాపురం, అక్టోబరు 13: ముఖ్యమంత్రి చంద్రబాబును పిఠాపురం మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిసిన శాలువాతో సత్కరించి నియోజకవర్గంలో పరిస్థితులపై వివరించారు.



ముగిసిన భేతాళస్వామి ఉత్సవాలు

సామర్లకోట, అక్టోబరు 13: వేట్లపాలెంలో భేతాళస్వామి ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఆదివారం సాయంత్రం నిర్వహించిన సంబరం ఉత్సవంలో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, రాజానగరం నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుణ్ణం చంద్రమౌళి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చంద్రమౌళి, వెంకటరమణలు భేతాళనికి మొక్కుబడులో భాగంగా కత్తికి శివారున నిమ్మకాయ గుచ్చి స్వామికి సమర్పించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రముఖులకు ప్రసాదాలు అందజేశారు. అనంతరం జరిగిన సంబరంలో బాణసంచా కాల్పులపోటీ నిర్వహించగా వందలాది ప్రముఖులు, గ్రామస్తులు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. సామర్లకోట సీఐ శ్రీకృష్ణభగవాన్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. సామర్లకోటలో ప్రభుత్వాసుపత్రి ఆవరణలో పలువురు దాతల సౌజన్యంతో రూ.85 వేలతో నిర్మించనున్న రేకులషెడ్ నిర్మాణ పనులకు పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప జనసేన జిల్లా అధ్యక్షులు తుమ్మల బాబుతో కలిసి కొబ్బరికాయకొట్టి పనులను లాంఛనంగా ప్రారంభించారు.



భేతాళస్వామికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాజప్ప

శృంగారవల్లభస్వామి ఆలయంలో రద్దీ

పెద్దాపురం, అక్టోబరు 13: మండలంలోని తిరుపతి శృంగార వల్లభ స్వామి ఆలయానికి విజయదశమిరోజు అధికసంఖ్యలో భక్తులు పోటెత్తారు. స్వామివారికి ఒక్కరోజు రూ.2,48,948 ఆదాయం సమకూరినట్టు ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. స్వామిని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కుటుంబ సమేతంగా దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కొత్తిం వెంకట శ్రీనివాసరావు, తిరుపతి సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే దాట్ల ప్రత్యేక పూజలు

తాళ్లరేవు, అక్టోబరు 13: కోరింగ దుర్గామల్లీశ్వరి అమ్మవారికి విజయదశమి సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, పార్వతి దంపతులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. పటవల గ్రామానికి చెందిన టీడీపీ నేత భజన సత్తిబాబు దంపతులు రూ.70వేలు విలువచేసే బంగారు మంగళసూత్రాలను అమ్మవారికి బహూకరించారు. పి.మల్లవరంలో ధూళిపూడి వెంకటరమణ ఆధ్వర్యంలో సత్తెమ్మతల్లికి పూజలు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కిర్లంపూడి, అక్టోబరు 13: చెట్ల కొమ్మలు తొలగింపు పనుల కారణంగా మండలంలోని చిల్లంగి, జగపతినగరం, కిర్లంపూడి గ్రామాల్లో సోమవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయడం జరుగుతుందని జగ్గంపేట ఏఈ వీరభద్రరావు పేర్కొన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 13: జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మరణించాడు. గొల్లప్రోలు మండలం వన్నెపూడి గ్రామానికి చెందిన శ్రీపతి సుబ్బారావు(65) శనివారం సాయంత్రం పొలంలో మేపేందుకు తీసుకెళ్లిన గేదెలను తిరిగి తోలుకుని వస్తుండగా వన్నెపూడి పుంతరోడ్డు జంక్షన్ వద్ద 216వ జాతీయరహదారిపై కత్తిపూడి నుంచి ప్రత్తిపాడు వెళ్తున్న కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన సుబ్బారావును కారు డ్రైవర్ సహాయంతో ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలిసి కారు డ్రైవర్ పరారయ్యాడు. కోటిలంక శ్రీను ఫిర్యాదు మేరకు గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేశారు.

అయోధ్యకు సైకిల్ యాత్ర

కాకినాడ రూరల్, అక్టోబరు 13: గ్రామం బాగుండాలని ఆదివారం మండలంలో ఇంద్రపాలెం నుంచి నలుగురు అయోధ్యకు సైకిల్ యాత్ర చేపట్టారు. గ్రామానికి చెందిన వాసంశెట్టి వీరభద్రం, విత్తనాల హరి, కాళ్లశ్రీను, కాకినాడకు చెందిన దారాపు బాలారెడ్డి మెరక వీధిలోని ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, నియోజక వర్గ సమన్వయకర్త సత్యనారాయణ మూర్తి ముఖ్యఅతిథులుగా జెండా ఊపి యాత్ర ప్రాంభించారు.

సామర్లకోటలో భారీ వర్షం

సామర్లకోట, అక్టోబరు 13: మండలం, పట్టణంలో శని, ఆదివారాల్లో భారీ వర్షం కురిసి లోతట్టు ప్రాంతాలు మునిగాయి. ఇటీవల పట్టణంలో కాలువల పూడిక తీత పనులు చేపట్టినప్పటికీ ముంపు బెడద తప్పలేదని పలువురు వాపోయారు.

లోవ క్షేత్రంలో భక్తుల కోలాహలం

తుని రూరల్, అక్టోబరు 13: తూర్పు కనుమల్లో కొలువుదీరి భక్తుల ఆరాధ్యదైవంగా పూజలందుకుంటున్న తలుపులమ్మ లోవ క్షేత్రానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తజనంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. వేకువ జామునే అమ్మవారికి విశేష అలంకరణ గావించి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆలయ పండితులు భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కుటుంబ సమేతంగా తరలివచ్చిన భక్తజనంతో ఆలయ ప్రాంగణంలో వంటావార్పులు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు. వారికి ఆలయ ఈవో పి.విశ్వనాధరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఒక్క రోజే ఆలయానికి రూ.1.25లక్షల ఆదాయం సమకూరినట్టు ఈవో ఒక ప్రకటనలో తెలిపారు.

పాదగయలో ఎస్పీ పూజలు

పిఠాపురం, అక్టోబరు 13: పట్టణంలోని పాదగయ క్షేత్రాన్ని జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ సందర్శించారు. పాదగయలోని కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికాఅమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు ఆశీర్వచనాలు పలికారు. ఎస్పీని ఆలయ ఈవో పి.విశ్వనాథరాజు శేషవస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాలను అందజేశారు.



జమ్మిచెట్టు వద్ద పూజలు చేస్తున్న ఎస్పీ

వేంకటేశ్వరస్వామి ఆలయానికి విరాళం

జగ్గంపేట, అక్టోబరు 13: మండలంలోని రాజపూడిలో వేంకటేశ్వరస్వామి, సత్యనారాయణ స్వామి, సీతారాముల ఆలయ పునఃనిర్మాణానికి, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి రుచి హోటల్స్ అధినేత, టీడీపీ యువ నేత పాలచర్ల నాగేంద్ర చౌదరి సత్యభారతి దంపతులు వారి కుమారులు నవదీప్ వెంకట సాయి, జ్ఞానేశ్వర్ కలిసి రూ.50వేలు విరాళం అందజేశారు.

'శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు'

జగ్గంపేట, అక్టోబరు 13: రౌడీషీటర్లు సత్‌ప్రవర్తనతో నడుచుకోవాలని జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం కిర్లంపూడి పోలీస్‌స్టేషన్లో రౌడీషీటర్లకు సీఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కష్టపడి పని చేసుకుంటూ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉండాలన్నారు. ఎటువంటి గొడవలు, సెటిల్‌మెంట్‌లు, దందాలు, ఇతర వ్యవహారాలలో జోక్యం చేసుకుంటే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పోలీస్ ఉన్నతాధికారుల దృష్టిలో సమాజంలో మంచి పేరు సంపాదించుకుని మీకున్న ముద్రను తొలగించుకోవాలని సూచించారు.

గండేపల్లి: గండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ శివనాగబాబు ఆధ్వర్యంలో జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. కష్టపనిచేసుకుని కుటుంబాన్ని పోషించుకోవాలన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 13: గొల్లప్రోలు మండలం తాటిపర్తి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 2010-11 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఇందన వారి కల్యాణమండపం వేదికగా కలుసుకున్నారు. 13ఏళ్ల తర్వాత కలిసి చదువుకున్న వారంతా తరగతి గదుల్లో తాము చేసిన అల్లరి, ఉపాధ్యాయుల మందలింపులు తదితర విషయాలను గుర్తుకు తెచ్చుకున్నారు. ఆటపాటలతో సరదాగా గడిపారు. చదువు చెప్పిన ఉపాధ్యాయులను సత్కరించారు.

20న ప్రత్తిపాడులో బీకేఎస్ సమావేశం

ప్రత్తిపాడు, అక్టోబరు 13: భారతీయ కిసాన్ సంఘం జిల్లా సమావేశం ఈ నెల 20న ప్రత్తిపాడు లయన్స్ కమ్యూనిటీ హాల్లో నిర్వహిస్తున్నట్టు ఆ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి రాసంశెట్టి రాజుబాబు తెలిపారు. రాష్ట్ర నాయకులు పరిమి వెంకట రాఘవులు, జలగం కుమారస్వామి, ఎం.శ్రీధర్ రెడ్డి, కె.సత్తిరాజు, యల్లపు సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షులు గోపు నారాయణ పాల్గొంటారన్నారు.